సాక్షి
కుమురం భీం

బుధవారం ● 27 ● మార్చి ● 2024



'ఉపాధి'లో మహిళలు!
ఉపాధిహామీ పథకాన్ని మహిళలు వినియో గించుకుంటున్నారు. జిల్లాలో 1,21,912 మంది మహిళలు కూలీలుగా పేరు నమోదు చేసుకున్నారు.
9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ: 6:30	గురు: 4:52

వాతావరణం
గరిష్టం/కనిష్టం 38.9 /26.6
చాలా వరకు ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ఆర్టీసీ డీఎం



ఎస్పీ సురేశ్‌కుమార్‌కు మొక్క ఇస్తున్న డీఎం

ఆసిఫాబాద్‌: ఇటీవల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.విశ్వనాథ్ మంగళ వారం ఎస్పీ సురేశ్‌కుమార్‌ను జిల్లా కేంద్రం లోని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిశారు. పూలమొక్క అందించిన అనంతరం ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, మహాలక్ష్మి పథకంపై చర్చించారు. శాంతి భ ద్రతల పరిరక్షణ కోసం బస్టాండ్ ఆవరణలో ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించాలని కోరా రు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

'పది' పరీక్షలకు 37 మంది గైర్హాజరు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతు న్నాయి. జిల్లాలో మంగళవారం నిర్వహించిన పరీక్షకు 6,425 మంది విద్యార్థులకు 6,388 మంది హాజరు కాగా.. 37 మంది గైర్హాజర య్యారని డీఈవో అశోక్ తెలిపారు. ఇందులో ప్రైవేట్‌గా ఫీజులు చెల్లించి 97 మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పరీక్ష కేంద్రాలను డీఈవో తనిఖీ చేశారు.

ఆర్‌ఎంపీపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ స్పందన

దహెగాం: ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించి గాదం నీలక్క(55) అనే మహిళ మృతి చెందిందని ఫిర్యాదు అందడంతో మంగళ వారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్పందన విచారణ ప్రారంభించారు. కాగా.. విచారణకు వెళ్లిన సమయంలో ఆర్‌ఎంపీ లక్ష్మణ్‌కు చెందిన క్లినిక్ మూసి ఉంది. దీంతో క్లినిక్‌కు సమీపం లోని ల్యాబ్‌లో నీలక్కకు ఏమైనా పరీక్షలు చేశారా అని వివరాలు సేకరించారు. అక్కడ ఎలాంటి టెస్టులు చేయలేదని తేలింది. ఆర్ ఎంపీ అందుబాటులో లేనందున తదుపరి విచారణ చేపడతామని వైద్యాధికారి తెలిపారు. అనారోగ్యం బారిన పడిన నీల క్కకు ఆర్‌ఎంపీ లక్ష్మణ్ తన శ్రీఆంజనేయ క్లినిక్‌లో వైద్యం అందించాడని పేర్కొన్నారు. ఈ నెల 22న నీలక్క మృతి చెందడంతో ఆర్ ఎంపీ వైద్యం వికటించిందని బాధిత కుటుం బం జిల్లా వైద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశా రని తెలిపారు. డీఎంహెచ్‌వో ఆదేశాలతో విచారణ చేపట్టామన్నారు.

భగీరథ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌: మూడు నెలల పెండింగ్ వేత నాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేం ద్రంలోని గ్రిడ్ కార్యాలయం ఎదుట మంగళ వారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించ కుండా ఎల్‌అండ్‌టీ యాజమాన్యం ఇబ్బంది లకు గురి చేస్తుందని ఆరోపించారు. సంబం ధిత అధికారులు సైతం కార్మికుల సమస్యల పై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అను గుణంగా కనీస వేతనాలు అమలు చేయా లని, ఈఎస్ ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశా రు. ఆసిఫాబాద్, వాంకిడి మం డలాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి'

దహెగాం: బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలో మంగళ వారం బీఆర్‌ఎస్, బీఎస్పీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ బీఆర్‌ఎస్‌లో చేరారని, ఈ నెల 28న కాగజ్‌నగర్ పట్టణానికి వస్తున్నారన్నారు. భారీగా కార్యకర్తలు తరలిరావాలని పేర్కొ న్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. షాకీర్, ఎల్కరి ప్ర శాంత్, బాలు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జలం.. జర భద్రం!



దహెగాం: ఇది కాగజ్‌నగర్ నుంచి దహెగాం మండలానికి వెళ్లే దారిలోని పెద్దవాగు. ఎండ లు పెరుగుతుండటంతో కాగజ్‌నగర్ పట్టణం తోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి రెండు, మూడు రోజులుగా యువకులు స్నానాలు చేసేందుకు ఇక్కడికి వస్తున్నారు. తాత్కాలిక రోడ్డు కోసం వేసిన పైపుల వద్ద ప్రవాహ వేగం ఎక్కువగా ఉంది. అలాగే నీటిమట్టం సైతం అధికంగా ఉంటుంది. గత వర్షాకాలం లో తాత్కాలిక రోడ్డు దాటే క్రమంలో పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే.



కౌటాల మండలం తాటిపల్లి వద్ద వార్ధా నదిలోకి స్నానాలకు వెళ్లి నలుగురు యువకు లు నీట మునిగి మృతి చెందిన ప్రాంతం ఇదే. ఇక్కడికి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రజలు స్నానాలకు వస్తుంటారని స్థానికులు చెబుతు న్నారు. అయితే లోతుకు సంబంధించి ఇక్కడ ఎలాంటి హెచ్చరిక సూచికలు లేవు. కొత్త వారు లోతును అంచనా వేయలేక నీట మునిగే ప్రమాదం పొంచి ఉంది.

కౌటాల/చింతలమానెపల్లి: అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. నదులు, వాగుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుం టున్నా పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు చేపట్టడం తో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఏటా ఘటనలు పునరావృతమవుతున్నా పట్టించుకునే వారు కరువ య్యారు. జిల్లాకు ప్రాణాధారమైన జీవనదులు ప్రమాదాలకు నిలయాలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది.



ప్రాణహిత నదిలో స్నానాలు చేస్తున్న ప్రజలు(ఫైల్)

- ప్రాణాంతకంగా నదీ స్నానాలు!
- పెన్‌గంగ, ప్రాణహిత, పెద్దవాగుల్లో తరచూ ప్రమాదాలు
- తీర ప్రాంతాల్లో కానరాని రక్షణ చర్యలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- తాజాగా 'వార్ధా'లో మునిగి నలుగురు యువకులు మృతి

పండుగలు.. పుణ్యస్నానాలు

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దున ఉన్న కుమురం భీం జిల్లాలోని ప్రజలు ఇరు రాష్ట్రాల సంప్రదాయా లు పాటిస్తారు. ఇక్కడ ఆధ్యాత్మికత, భక్తిభావం ఇ తర ప్రాంతాలతో పోలిస్తే కాస్త ఎక్కువే. పండుగ లు, జాతరల సమయంలో ప్రజలు సమీపంలోని వాగులు, నదులు, చెరువులు, వాగుల్లోకి పుణ్యస్నా నాలకు వెళ్లడం సర్వసాధారణం. కార్తీక మాసం, ఇంట్లో శుభ, అశుభ కార్యక్రమాలు, శివరాత్రి, హో లీ ఇతర జాతరల సమయంలో అందరూ నదుల్లో గంగాస్నానం చేయడం పరిపాటిగా మారింది. ఇక వేసవి ప్రారంభమైన తర్వాత యువత, చిన్నారులు కూడా వేడి నుంచి ఉపశమనం కోసం స్నానాలకు వెళ్తుంటారు. పెళ్లిళ్లు, వేడుకల సమయంలోనూ బం ధువులు, మిత్రులతో కలిసి నదీ తీర ప్రాంతాల్లో విందులు చేసుకుని స్నానాలు చేస్తుంటారు.

జీవ నదులు.. నిత్యం ప్రవాహం

జిల్లాలోని జీవ నదుల్లో ఏడాదంతా ప్రవాహం కొన సాగుతుంటుంది. అలాగే కొన్ని వాగులు సైతం జల కళతోనే ఉంటాయి. జిల్లాకేంద్రం ఆసిఫాబాద్ సమీపంలోని పెద్దవాగు, గుండి గ్రామం సమీపం లోని వాగు, వాంకిడి సమీపంలోని చిక్లివాగు, కుమురంభీం(అడ) ప్రాజెక్టు, వట్టి వాగు ప్రాజెక్టు జలాశయాల్లో నిత్యం జలకళ కనిపిస్తుంది. కాగజ్‌న గర్ పట్టణం సమీపంలో పెద్దవాగు ప్రవహిస్తుంది. ఆదిలాబాద్ జిల్లా మీదుగా వచ్చే పెన్‌గంగ నది సిర్పూర్(టి) మండలంలోని హుడ్కిలి, టోంకిని, వెంకట్రావుపేట, లోనవెల్లి, కౌటాల మండలంలోని వీరవెల్లి, తాటిపల్లి, వీర్దండి, గుండాయిపేట, వరకు వార్ధా నదిగా ప్రవహిస్తుంది. కౌటాల మండలం లోని తుమ్మిడిహెట్టి, చింతలమానెపల్లి మండలం లోని రణవెల్లి, కోర్సిని, దిందా, చిత్తాం, గూడెం, బూరుగూడ, బెజ్జూర్ మండలంలోని సోమిని, తలా యి, పెంచికల్‌పేట్ మండలంలోని ముర్లిగూడ, దహెగాం మండలంలోని మొట్లగూడ, రాంపూర్ గ్రామాల వరకు ప్రాణహిత నది ప్రవాహం ఉం టుంది. సమీప గ్రామాల్లోని ప్రజలు నిత్యం ఇక్క డికి స్నానాల కోసం వస్తుంటారు. ప్రజల తాకిడి ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లోనే తరచూ ప్రమా దాలు నమోదవుతున్నాయి. కాగజ్‌నగర్ పట్టణం సమీపంలోని పెద్దవాగు, కౌటాల మండలంలోని పెన్‌గంగ, ప్రాణహిత నదిలో ప్రమాదాలు ఎక్కువ గా చోటుచేసుకున్నాయి.

గతంలో ప్రమాదాలు

- కౌటాల మండలం వీరవెల్లి వద్ద 12 సంవ త్సరాల క్రితం పడవలో నది దాటుతూ నీటమునిగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఒకేసారి మృతి చెందారు.
- చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద మూడు సంవత్సరాల క్రితం ప్రాణహిత నదిలో పడవలో వెళ్తున్న ఇద్దరు బీట్ అధి కారులు నీట మునిగి మృతి చెందారు.
- సిర్పూర్(టి) మండలంలోని టోంకిని వద్ద స్నానాలకు వెళ్లి ఆరు నెలల క్రితం చౌ దరి మారుతి అనే వ్యక్తి మృతి చెందాడు.

ముందస్తు చర్యలు శూన్యం..

కౌటాల మండలంలోని తాటిపల్లి వద్ద వార్ధా నదికి హోలీ సందర్భంగా ప్రజలు స్నానానికి వచ్చే అవకాశం ఉంటుందని తెలిసినా అధికా రులు ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరో పణలు ఉన్నాయి. ప్రజలు రక్షణపై బాధ్యత గా వ్యవహరించాల్సిన యంత్రాంగం అలస త్వం ప్రదర్శించిందని విమర్శలు వ్యక్తమవు తున్నాయి. నదిలో స్నానాలకు అనువైన ప్రదేశాలను గుర్తించి, నీటిమట్టం ఎక్కువగా ఉండి ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాల్లో హె చ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయా ల్సి ఉన్నా పట్టించుకోలేదు. ముందస్తుగా చ ర్యలు చేపట్టి ఉంటే నలుగురు యువకులు ప్రమాదం బారిన పడేవారు కాదనే అభిప్రా యం వ్యక్తమవుతుంది. సంబంధిత తాటిప ల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రజితను ఈ విషయంపై సంప్రదించగా.. 'తాము ఎలాం టి చర్యలు తీసుకోలేదని.. ప్రజల తాకిడి విషయంపై ఉన్నతాధికారులకు సైతం సమా చారం ఇవ్వలేదు' అని తెలిపారు. ఇక ముం దు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్‌: రైతులు పండించిన చివరి గిం జ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళ వారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవ సాయ, పౌరసరఫరాల శాఖల అధికారుల తో వరిధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సర ఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశిం చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీటితో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ.. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో పౌరసరఫరాల శాఖ, ఐకేపీ ఆధ్వర్యంలో 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేం దుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్త కుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నీడ కోసం షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేసి, టార్పాలిన్లు అందుబాటు లో ఉంచుతామని వివరించారు. ధాన్యం తూకం జరిగిన వెంటనే మిల్లులకు తరలిం చే విధంగా చర్యలు చేపడుతున్నామని, గన్ని సంచుల ఏర్పాటుతో పాటు సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బంది లు తలెత్తకుండా కార్యాచరణ రూపొందిం చినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 2 మున్సిపాలిటీలు, 334 గ్రామ పంచాయ తీల్లో తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీఆర్‌డీవో సురేంద ర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాసరావు, పౌరసరఫరాల శాఖ అధికారి తారామణి, జిల్లా మేనేజర్ నర్సిం గావు, డీపీవో భిక్షపతి పాల్గొన్నారు.

వండి పెట్టేదెలా?



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు(ఫైల్)

- త్వరలో ముగియనున్న విద్యాసంవత్సరం
- మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లోనే వేతనాలు
- జిల్లాలో 1,591 మంది కార్మికులు

బెజ్జూర్(సిర్పూర్): మరికొద్ది రోజుల్లో విద్యాసంవ త్సరం ముగియనుంది. అయినా ప్రభుత్వ పాఠశా లల్లో విద్యార్థులకు భోజనం వండి పెట్టే కార్మికుల కష్టాలు మాత్రం తీరడం లేదు. నెలల తరబడి వేత నాలు పెండింగ్‌లోనే ఉంటున్నారు. నెలంతా పని చేస్తే వచ్చే గౌరవ వేతనం అరకొర మాత్రమే. అదికూడా నెలనెలా సక్రమంగా వారికి అందడం లేదు. మధ్యాహ్న భోజనం విషయంలో నిబంధన లు పాటించాలని సూచిస్తున్న ప్రభుత్వం.. బిల్లులు, వేతనాలు సకాలంలో అందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెనూ పాటించడం కష్టమే..

జిల్లాలో 973 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతుండగా 1591 మంది కార్మికులు పనిచే స్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధు లతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యా హ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. వారంలో మూడు రోజులపాటు కోడిగుడ్డుతో నాణ్యమైన భోజనం ఇచ్చేందుకు వీలుగా మెనూ రూపొందిం చారు. ఒక్క గుడ్డు ధర మార్కెట్లో ఒక్కోసారి రూ.6 దాటుతున్నా ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తోం ది. బియ్యం మినహా ఇతర సామగ్రి మొత్తం నిర్వా హకులే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ రూపొందిం చిన మెనూ పాటించడం ఎలా ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పలుమార్లు కార్మికులు సమ్మెబాట పట్టారు. దాదాపు ఎనిమిది నెలల నుం చి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లాలోని కార్మికులు చెబుతున్నారు. బకాయిలు చెల్లించడం తోపాటు పెంచిన వేతనం, ఇతర సౌకర్యాలు కల్పిం చకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

అరకొరగా చెల్లింపులు

మధ్యాహ్న భోజన నిర్వహణకు ప్రభుత్వం విడు దల చేస్తున్న అరకొర చెల్లింపులతో నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఉన్నత పాఠశాలల విద్యా ర్థులకు చెల్లిస్తున్న ధరలతో మెనూ అమలు చేయలే కపోతున్నామని పేర్కొంటున్నారు. ప్రైమరీ స్కూళ్ల లో ఇరవై మంది విద్యార్థులకు ఒక్కరోజు రూ.100 ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా ఖర్చు మాత్రం రూ.150 దాటుతుందని చెబుతున్నారు. పాఠశాల లో ఒక్క విద్యార్థికి వంద గ్రాముల బియ్యం మినహా మిగతా కూరగాయలు, పప్పులు, నూనె, ఉప్పు, కారం, కొత్తిమీర తదితర సరకులన్నీ నిర్వా హకులే కొనుగోలు చేయాల్సి వస్తోంది. చాలాచోట్ల కట్టెల పొయ్యిలపైనే వంట చేయడంతో ఆ భారం వారిపైనే పడుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు చెల్లిం చాలని డిమాండ్ చేస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి



పెరిగిన నిత్యావసర ధర లకు అనుగుణంగా నిర్వా హకులకు ఇచ్చే చార్జీలు పెంచాలి. బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి. ప్రభు త్వపరంగా కోడిగుడ్లు సరఫరా చేయాలి. ప్రతినెలా 10వ తేదీలోగా బిల్లులు అందించేలా చర్యలు తీసు కోవాలి. యూనిఫాం, గుర్తింపు కార్డు ఇవ్వడం తోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.

– కొండ కళావతి, మధ్యాహ్న భోజన కార్మికురాలు, బెజ్జూర్

శ్రమ దోపిడీ



మధ్యాహ్న భోజన కార్మికు లను రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తోంది. పెం డింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. కనీస వేతనం రూ.26వేల వరకు పెంచాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌక ర్యం కల్పించి వారిని ఆదుకోవాలి.

– ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల యాప్‌లు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌: భారత ఎన్నికల సంఘం రూపొందిం చిన ఎన్నికల యాప్‌లు రాజకీయ పార్టీలు వినియో గించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృ త కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీఆ ర్వో లోకేశ్వర్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సీ వి ధ, సీవిజిల్, 1950 నంబర్‌ను ఉపయోగించుకోవా లని సూచించారు. అభ్యంతరాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు, ఇతర సమస్యలపై యాప్‌లు, కంట్రోల్‌రూమ్‌లో నమోదు చేయవచ్చ న్నారు. ప్రచార సంబంధిత అనుమతుల కోసం మీ డియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీల్లో సంప్రదించాలని సూచించారు. కలెక్టరేట్ లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ నం.08733-279033 ఏర్పాటు చేశామని.. ఫిర్యాదులు, సమస్యలు, వివరాలకు సంప్రదించవచ్చన్నారు. త్వర లో వ్యయ పరిశీలకులు, సాధారణ పరిశీలకులు జిల్లాకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఏప్రిల 3న ఉదయం 11 గంటలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ చేపడతామని పేర్కొన్నారు. కెరమెరి మండలం లోని 12 గ్రామాల్లో ఓటరు అవగాహన కార్యక్రమా లు చేపడతామని వివరించారు. సమావేశంలో తహ సీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఎన్నికల విభాగం పర్య వేక్షకులు మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి దశ ర్యాండమైజేషన్‌కు ఏర్పాట్లు

మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంక టేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంగళవారం ఆసి ఫాబాద్, సిర్పూర్ రిటర్నింగ్ అధికారులు దాసరి వేణు, దీపక్ తివారితో కలిసి డీఆర్వో లోకేశ్వర్, నోడల్ అధికారి అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండేతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లా డుతూ మొదటి దశలో 3,973 మందిని ర్యాండమై జేషన్ చేస్తామని తెలిపారు. ఉద్యోగులకు కేటాయిం చిన విధుల్లో సవరణలకు జిల్లా ఎన్నికల అధికారికి దరఖాస్తు సమర్పించాలన్నారు. ఈ– డిస్ట్రిక్ట్ మేనే జర్ గౌతమ్ రాజు, నేషనల్ ఇన్ఫర్మేషన్ సిబ్బంది డి.శ్రీకాంత్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీన్ మారింది!

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత మారిన రాజకీయాలు
- బీఆర్‌ఎస్ నుంచి పలువురు ముఖ్య నేతలు జంప్
- బీజేపీలో కరువైన సమన్వయం
- చేరికలపై ఫోకస్ పెంచిన కాంగ్రెస్
- పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు మనోగతం ఎటువైపో?

సాక్షి, ఆదిలాబాద్‌: అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆది లాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నియోజక వర్గాల్లో ఆయా పార్టీల్లో సీన్ మారిపోయింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు మనోగతం ఎటువైపు ఉంటుందో అనేది ఆసక్తికరంగా మారిం ది. శాసనసభ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అత్యధిక ఓట్లు బీఆర్‌ఎస్ సాధించగా, ఆ తర్వాత బీజేపీ, మూడో స్థానంలో కాంగ్రెస్ నిలిచింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో ఫలితం ఎలా ఉంటుందనేది చూడాల్సిం దే. నియోజకవర్గాల్లో మారిన పరిస్థితుల నేపథ్యం లో ఓటరు తీరు కూడా మారుతుందా.. లేనిపక్షంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలిక లేదన్నట్టు గా వైవిధ్యంగా తీర్పునిస్తారో చూడాల్సిందే.

బీఆర్‌ఎస్ నుంచి వలసలు..

అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ నుంచి ఆదిలాబాద్‌లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కాం గ్రెస్‌లోకి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బీజేపీలోకి చేరిపోయారు. కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకు లు కూడా పైరెండు పార్టీల్లోకి జంప్ చేశారు. బోథ్ నియోజకవర్గంలో తాంసి జెడ్పీటీసీ రాజు, ఇతర ద్వితీయ శ్రేణి నేతలు ఇటీవలే బీజేపీలో చేరారు. నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రె స్‌లో చేరుతారనే ప్రచారం సాగుతుంది. మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ కాంగ్రెస్‌లో చేరారు. ముథోల్ లో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. సిర్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రెండో స్థానంలో నిలిచింది. తద్వారా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దీని ప్రభావం ఎలా ఉంటుం దో చూడాల్సిందే. బీఆర్‌ఎస్ అభ్యర్థి సక్కు ముఖ్యం గా ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలు పార్టీ మారడంతో అక్కడ ఓటర్లను ఆకట్టుకునేందుకు శ్రమించాల్సిన పరిస్థితి కనిపిస్తుంది.

బీజేపీలో సఖ్యత కుదిరేనా..

బీజేపీ అభ్యర్థిగా గొడం నగేశ్‌కు ఆయా నియోజకవ ర్గాల్లో ముఖ్య నేతలతో సఖ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బోథ్ నియోజకవర్గం లోని తలమడుగు మండలం ఉండం గ్రామంలో కేంద్ర మంత్రి అర్జున్ ముండా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్లమెంటరీ సమావేశంలో నిర్మల్, ముథోల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబులు పాల్గొనకపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కూడా పాల్గొనలేదు. ఎంపీ సోయం బాపూరావు తనకు టికెట్ ఇవ్వలేదన్న అసంతృప్తిలో పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సిట్టింగ్ స్థానాన్ని బీజేపీ నిలుపుకునేందుకు ప్రధానంగా ముఖ్య నేతల మధ్య సమన్వయం అవసరమన్న అభి ప్రాయం వ్యక్తమవుతుంది. ఇటీవల హైదరాబాద్ లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సఖ్యత కోసం తీసు కోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలుస్తుంది. ఎన్నికల నోటిఫికేషన్ ముందే ఈ పార్టీలో పరిస్థితు లు చక్కదిద్దుకుంటాయా అనేది వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్ బలగం పెరుగుతోంది..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండగా, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్‌పై ఆ పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మం త్రిగా వ్యవహరిస్తున్న సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవ ర్గం పరిధిలో గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఖానాపూర్, ముథోల్ నియో జకవర్గంలో సమావేశాలు పూర్తి చేశారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలగం పెరుగుతుండటం తో ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్త మవుతుంది. అయితే ఇప్పటికీ అభ్యర్థి ప్రకటనలో పార్టీ పరంగా తర్జనభర్జన నెలకొంది. బీజేపీ, బీఆర్ ఎస్‌లు అభ్యర్థులను ప్రకటించి ప్రచారానికి దిగు తుండగా, కాంగ్రెస్ మాత్రం ఇప్పటికీ అభ్యర్థిని ప్రక టించకపోవడం కొంత మైనస్‌గా మారుతుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో సాధించిన ఓట్లు..

పార్టీ	ఓట్లు
బీఆర్‌ఎస్	4,65,476
బీజేపీ	4,48,961
కాంగ్రెస్	2,52,286

డిప్యూటేషన్లపై డిష్యుం డిష్యుం!

- యూజీలో పని చేసేవాళ్లు సర్ఫేస్‌లో..
- వెనక్కి పంపాలంటున్న ఏఐటీయూసీ
- డిప్యూటేషన్ల రద్దుకు అధికారుల యత్నం
- అడ్డుకుంటున్న రాజకీయ నాయకులు
- అర్హులకు దక్కని డిప్యూటేషన్ అవకాశం



శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ డివిజన్‌లో డిప్యూటేషన్ల వివాదం ముదురుతోంది. భూగర్భంలోకి దిగి పని చేయాల్సిన కొందరు యూనియన్ నేతలు, కార్యకర్తలు డిప్యూటేషన్ల పేరిట సర్ఫేస్ డిపార్ట్‌మెంట్లలో తిష్టవేశారు. లోపల కష్టపడి పనిచేయాల్సినవారు సర్ఫేస్‌లోకి డిప్యూటేషన్‌పై వచ్చి తేలికపాటి పనులు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇలా కొన్ని సంవత్సరాలుగా సర్ఫేస్‌లోని ఓసీపీ, సీహెచ్‌పీ, వర్క్‌షాప్, సివిల్ ఇతర డిపార్ట్‌మెంట్లకు డిప్యూటేషన్ పేరుతో వచ్చి ఇక్కడే తిష్టవేస్తున్నారు. కొందరి డిప్యూటేషన్ కాలం దగ్గరపడినా వెనక్కి వెళ్లడంలేదు. రాజకీయ వ్యవహారాలు, ఇతర వ్యాపారాలు చేసేవారే ఎక్కువగా డిప్యూటేషన్‌లో ఉన్నట్లు సమాచారం. శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 175 మంది డిప్యూటేషన్ పేరిట సర్ఫేస్‌లో పని చేస్తుండగా, వీరిని వెనక్కి పంపడానికి అధికారులు తంటాలు పడుతున్నారు.

గుర్తింపు సంఘం అభ్యంతరం

తాజాగా గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ నాయకులు ఈ వ్యవహారంపై తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు. నాటి టీబీజీకేఎస్ హయాంలో అక్రమంగా డిప్యూటేషన్‌పై వచ్చి సర్ఫేస్ డిపార్ట్‌మెంట్లలో తిష్టవేసిన వారిని వెనక్కి పంపాలని కోరుతూ రెండు నెలల క్రితం అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి జాబితాను ఏరియా అధికారులకు ఇచ్చారు. దీంతో వివాదం మొదలైంది. కాగా, భూగర్భంలో పని చేయలేమని, సర్ఫేస్‌లో పని ఇవ్వాలని కీళ్ల నొప్పులు, నడుం నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న సీనియర్ కార్మికులు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోని అధికారులు యూనియన్ల నాయకులు, కార్యకర్తలను ఐఆర్ రిలేషన్ పేరిట డిప్యూటేషన్లపై సర్ఫేస్‌లకు పంపడం విమర్శలకు తావిస్తోంది.

అనారోగ్య కార్మికులకు తిప్పలే..

సామాన్య కార్మికులు అనారోగ్యానికి గురై డిప్యూటేషన్ కోరితే వారికి మాత్రం అధికారులు అవకాశం ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. యూనియన్ల నాయకులు, పలుకుబడి కలిగిన రాజకీయ నేతలు చెబితేనే సింగరేణిలో సర్ఫేస్‌లో డిప్యూటేషన్ పనులు అవుతాయనేది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం డిప్యూటేషన్ పేరిట తిష్టవేసిన సుమారు 175 మందిని వెనక్కి పంపడానికి ఏరియా అధికారులు కొద్దిరోజుల క్రితమే నిర్ణయించారు. కానీ.. యూనియన్ల నేతలు దీనిపై ఏరియా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధుల పేరు చెప్పి మరికొందరు తమ డిప్యూటేషన్లను ఆపుకోవడం కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ రిటైర్డ్ జీఎం హయాంలో డిప్యూటేషన్‌పై వచ్చిన వారు కూడా ఇప్పటికీ సర్ఫేస్‌లోనే కొనసాగుతున్నారు. కంపెనీ అవసరాల కోసం కూడా కొంత మందిని డిప్యూటేషన్‌పై సర్ఫేస్‌లో తీసుకుంటారు. దీనిపై ఎలాంటి వివాదం లేదు. ఎలాంటి అర్హత లేకుండా పలుకుబడితో యూనియన్ల నేతలు చేస్తున్న ఈ డిప్యూటేషన్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరముందని కార్మికవర్గం కోరుతోంది.

సమీక్షించి చర్యలు తీసుకుంటాం

ఏప్రిల్‌లో డిప్యూటేషన్లపై సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం సర్ఫేస్‌లో ఉన్న జనరల్ మజ్దూర్, ఇతర ఖాళీలను భర్తీ చేస్తాం. ఇంకా మిగిలి ఉంటే దానికి తగినట్లు ఐఈడీ నార్మ్స్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. డిప్యూటేషన్లపై కార్పొరేట్ అధికారులతో చర్చించి వారి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటాం.

– సంజీవరెడ్డి, శ్రీరాంపూర్ జీఎం

యూనియన్ మారి డిప్యూటేషన్ ఆపుకొని..

అప్పట్లో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ హయాంలో కొంతమంది డిప్యూటేషన్ల పేరిట వెళ్లి ఇప్పటికీ సర్ఫేస్‌లో కొనసాగుతున్నారు. గత గుర్తింపు ఎన్నికల ముందు వీరు టీబీజీకేఎస్ ఓడిపోతుందని తెలిసి వారి డిప్యూటేషన్‌ను కాపాడుకోవడం కోసం ఐఎన్టీయూసీలో చేరారు. ఇప్పుడు వారు ఆ యూనియన్ అండ, కాంగ్రెస్ అధికారంలో ఉందనే ధీమాతో డిప్యూటేషన్లను పదిలం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, డిప్యూటేషన్లపై సర్ఫేస్‌లో పని చేసేవారిలో అన్ని సంఘాల నేతలు, కార్యకర్తలూ ఉన్నారు. గెలిచిన సంఘం నుంచి ఎక్కువ మంది ఉంటే మిగతా ప్రతిపక్ష సంఘాలకు చెందిన వారు తక్కువసంఖ్యలో ఇలా తిష్టవేయడం కంపెనీలో కొద్ది కాలంగా 'మామూలు'గా మారింది. తమ వారికి డిప్యూటేషన్లు ఇస్తే ఏ కార్మిక సంఘం నాయకులు ప్రశ్నించరు. ఇవ్వకుంటే వారికెందుకు ఇచ్చారు? అంటూ రచ్చరచ్చ చేస్తారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధికారులను బ్లాక్‌మెయిల్ చేసైనా తమ వారిని డిప్యూటేషన్‌పై సర్ఫేస్‌లో ఉంచుకోవడం కార్మిక సంఘాలకు 'మామూలు'గా మారిందనే విమర్శలున్నాయి.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయి సైకిల్‌పోలో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గఫార్, పీడీ బండ జీవరత్నం మంగళవారం తెలిపారు. ఈనెల 16వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మి, గాయత్రి, అహల్య పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 28నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఫీజు, స్కాలర్‌షిప్ చెల్లించాలి

మంచిర్యాలఅర్బన్: మూడేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు బోధన ఫీజులు, ఉపకార వేతనాలు చెల్లించకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఫీజు బకాయిలు చెల్లిస్తారని ఆశతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉపకార వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. తక్షణమే విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు శ్రీను, అజయ్, సాయి, అభి తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ పోటీల్లో రవికిరణ్‌కు కాంస్య పతకం



రవికిరణ్

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆసరెల్లి రవికిరణ్ డిస్కస్‌త్రో ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఈనెల 25నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన ఆరో ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ ఛాంపియన్ షిప్–2024 పోటీల్లో మంచి నైపుణ్యంతో ఎఫ్–37 కేటగిరీలో డిస్కస్‌త్రో ఈవెంట్‌లో 30 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకం సాధించాడు. అంగవైకల్యం ఉన్న రవికిరణ్ ఇంతకుముందు జావెలిన్‌త్రోలో కూడా పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాదని మరోసారి నిరూపించాడని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవికిరణ్‌ను అభినందించారు.

లారీల నుంచి డీజిల్ చోరీ



పగిలిన ట్యాంక్ తాళం

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం వారసంత వద్ద సోమవారం రాత్రి నిలిపి ఉంచిన లారీల నుంచి దొంగలు సుమారు 300 లీటర్ల డీజిల్ దొంగిలించినట్లు యజమానులు తెలిపారు. సోమగూడెం వారసంతలో రహదారి పక్కనే నిలిపి ఉంచిన లారీ నుంచి డీజిల్ ట్యాంక్ తాళం పగులగొట్టి వంద లీటర్లకుపైగా డీజిల్ తీసుకెళ్లారు. ఇదే రోడ్డు పక్కన మైదానం ఎదుట నిలిపి ఉంచిన మరో రెండు లారీల డీజిల్ ట్యాంకుల తాళాలు పగులగొట్టారు. ఒక లారీ నుంచి 200 లీటర్ల వరకు డీజిల్ దొంగిలించారు. మరో లారీ ట్యాంక్ తాళం పగులగొట్టేందుకు యత్నించి విఫలమయ్యారు. దీంతో ట్యాంకుపై పేర్లు రాసి, వింత బొమ్మలు వేసి దొంగలు సవాల్ విసిరారు.

కనీస వేతనాలు చెల్లించాలి



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్మికశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు ఎర్రగాని కృష్ణయ్య, ఎస్కే గౌస్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర కార్మికశాఖ విడుదల చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో పొందుపరిచిన వేతనాల ప్రతిపాదన సక్రమంగా లేదని తెలిపారు. దాన్ని తక్షణమే ఉపసంహరించుకుని 2021 జూన్‌లో విడుదల చేసిన జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో సింగరేణితో పాటు అనేక విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వీరంతా చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన సిద్దం పుల్లయ్య (73) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లయ్య మంగళవారం ఇంటి సమీపంలోని కూరగాయల చెట్లకు నీళ్లు పట్టేందుకు విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా షాక్ తగిలి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందాడు.

ఇంట్లోంచి పారిపోయిన అక్కా, తమ్ముడు

- తండ్రి మందలించగా అలిగిన చిన్నారులు
- చెప్పుల్లేకుండా ఎనిమిది కిలోమీటర్ల నడక
- తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



చిన్నారులను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

నెన్నెల: సెల్‌ఫోన్ పగులగొట్టారని తండ్రి మందలించగా అలిగిన ఇద్దరు చిన్నారులు ఇంట్లోంచి పారిపోయారు. ఈ ఘటన మండలంలోని కుశ్నపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఒల్లాల గణేశ్‌గౌడ్-వసంత దంపతులకు ఐదో తరగతి చదువుతున్న కూతురు వైష్ణవి, రెండో తరగతి చదువుతున్న కొడుకు శంకర్‌గౌడ్ ఉన్నారు. గణేశ్‌గౌడ్-వసంత మంగళవారం ఉదయం చేసుకు వెళ్లి వచ్చేసరికి సెల్‌ఫోన్ పగిలి ఉంది. గణేశ్‌గౌడ్ సెల్‌ఫోన్ ఎందుకు పగులగొట్టారని పిల్లలను మందలించాడు. బయటకు వెళ్లాలని తిట్టాడు. దీంతో చిన్నారులకు ఏం చేయాలో తోచక ఇంట్లోంచి పారిపోవాలని నిర్ణయించుకున్నారు. తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా బయటకు వచ్చి కుశ్నపల్లి నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని రెబ్బెన వరకు చెప్పులు లేకుండానే ఎండలో కాలినడకన వెళ్లారు. అక్కడి నుంచి నెన్నెలకు ఆటోలో చేరుకున్నారు. నెన్నెల నుంచి బెల్లంపల్లిలోని పెద్దనపల్లిలో ఉంటున్న నానమ్మ లక్ష్మి ఇంటికి వెళ్లాలని కాలినడకన బయలుదేరారు. కస్తూర్బా సమీపానికి రాగా నెన్నెలకు చెందిన ఐకేపీ వీవోఏ దుర్గం మల్లేశ్ వీరిని గమనించారు. వివరాలు తెలుసుకున్నారు. తమ తండ్రి తిట్టడంతో పారిపోయి వచ్చామని, బెల్లంపల్లిలోని నానమ్మ ఇంటికి వెళ్తున్నామని వారు చెప్పారు. దీంతో మల్లేశ్ వీరిని కస్తూర్బా పాఠశాలలో కూర్చోబెట్టి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని గణేశ్‌గౌడ్‌ను పిలిపించి పిల్లలను అప్పగించారు. ఇంట్లోంచి పారిపోయిన పిల్లలు దొరకడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ బైఠాయింపు

- తన భర్త వేధింపులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపణ
- తన తమ్ముడిపై అక్రమంగా ఎందుకు కేసులు పెట్టారని నిలదీత



పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన మహిళ

మంచిర్యాలక్రైం: అక్కను వేధింపులకు గురి చేస్తున్నాడని బావను మందలించినందుకు మంచిర్యాల పోలీసులు అక్రమంగా తన తమ్ముడిపై కేసులు పెట్టారని ఓ మహిళ ఆరోపించింది. న్యాయం చేయాలని కూతురితో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. మంచిర్యాల హమాలీవాడకు చెందిన నాగశ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రాంనగర్‌లోని విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో నాగ శ్వేత సబ్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. తన భర్త గుమ్ముల రాజ్‌కుమార్ కొంతకాలంగా తనను వేధిస్తున్నాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 2022 నవంబర్‌లో వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. కేసు కోర్టులో ఉండగా, రాజ్‌కుమార్ శ్వేతకు విడాకుల నోటీస్ పంపించాడు. దీంతో మూడేళ్ల కూతురితో తల్లిగారింట్లో ఉంటూ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది. శ్వేత బజారులో ఎక్కడ కనిపించినా రాజ్‌కుమార్ విడాకుల నోటీస్‌పై సంతకం పెట్టాలని వేధిస్తుండేవాడు. దీంతో రాజ్‌కుమార్‌తో తనకు ప్రాణభయం ఉందని పలుసార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని శ్వేత ఆరోపించింది. తన తమ్ముడు అన్వేశ్ అక్కను ఎందుకు ఇబ్బంది పెడుతున్నావని మందలించినందుకు రాజ్‌కుమార్ అతడిపై ఫిర్యాదు చేయగా పోలీసులు నాలుగు సెక్షన్ల కింద అక్రమకేసులు పెట్టారని వాపోయింది. తన భర్తతో ప్రాణభయం ఉందని రెండుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు తన తమ్ముడిపై కేసులు పెట్టి వేధించడమేమిటని ప్రశ్నించింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. ఈ విషయమై స్థానిక సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా.. శ్వేత, రాజ్‌కుమార్‌ల మధ్య గొడవ కోర్టు పరిధిలో ఉందని తెలిపారు. శ్వేత తమ్ముడిపై పాత కేసులుండగా అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడి మృతి



సురేశ్ (ఫైల్)

వాంకిడి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోనపూర్ పంచాయతీ పరిధి పూనగూడ గ్రామానికి చెందిన మడావి పార్వతి భర్త చందు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి కూతురు, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు సురేశ్ (18) తండ్రి మరణానంతరం వ్యవసాయం చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కొద్ది నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం హోలీ సందర్భంగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మళ్లీ మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని కోరాడు. దీంతో పార్వతి తన దగ్గర డబ్బులు లేవని తెలిపి మందలించింది. ఆవేశానికి గురైన సురేశ్ ఇంట్లోంచి వెళ్లిపోయాడు. కాసేపటికి వచ్చి తాను పురుగుల మందు తాగానని తల్లికి చెప్పాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులసాయంతో ద్విచక్రవాహనంపై వాంకిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన దేగల వివేక్‌రాజ్ వద్ద 500 గ్రాముల గంజాయి పట్టుకున్నామని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేసి మందమర్రిలో ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడని పేర్కొన్నారు. నమ్మదగిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. ఈ మేరకు వివేక్‌రాజ్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతడిపై గతంలోనూ బెల్లంపల్లి పరిధిలో గంజాయి కేసు నమోదైనట్లు తెలిపారు.

రూ.1.05లక్షల నగదు సీజ్



నగదును ఎస్ఎస్‌టీ సిబ్బందికి ఇస్తున్న ఎస్సై

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి చొప్పరిపల్లి సమీపంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టి రూ.1.05లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేసి గోలేటికి చెందిన అప్పం మహేశ్ వద్ద రూ.54,700 పట్టుకున్నట్లు తెలిపారు. మాచర్ల రాకేశ్ వద్ద రూ.51 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన మొత్తాన్ని ఎస్ఎస్‌టీ–2 సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

హాట్‌టాపిక్‌గా గడియారాల పంపిణీ



బీఆర్ఎస్ అధినాయకుల ఫొటోలతో గడియారం

చెన్నూర్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గోడ గడియారాల పంపిణీ హాట్‌టాపిక్‌గా మారింది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో గోడ గడియారాలు పంపిణీ చేయగా ఓట్ల కోసమే వీటిని పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గోడ గడియారాలపై మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే బాల్క సుమన్ అని ఫొటోలున్నాయి. వీటిని బాల్క సుమన్ పేరిట పంపిణీ చేస్తున్నారు. పార్లమెంట్ అభ్యర్థి ఫొటో లేకపోయినప్పటికీ బీఆర్ఎస్ అధినాయకుల ఫొటోలు ఉండడం కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలోని మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ప్రతినిధులు వీటిని పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒక్కో కౌన్సిలర్‌కు 35 నుంచి 50 గడియారాలు రాగా, బీఆర్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులకు వీటిని పంపిణీ చేస్తున్నామని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల కోసం..

అసెంబ్లీ ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు బాల్క సుమన్ గోడ గడియారాలు తయారు చేయించినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పంపిణీ చేస్తే కోడ్ ఉల్లంఘన కేసులు నమోదవుతాయని పంపిణీ నిలిపివేసినట్లు తెలిసింది. తయారు చేసిన గడియారాలు మూలన పడకుండా ప్రస్తుతం పంపిణీకి పూనుకున్నట్లు కొందరు బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు.

సంతల గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'ఎన్నికల కోడే ఆటంకమా?' శీర్షికన హాజీపూర్ మండలం వేంపల్లిలోని మేకల సంత నిర్వహణపై ఇచ్చిన వార్తా కథనంపై అధికారులు స్పందించారు. సమస్యకు పరిష్కారం కూడా చూపారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. వేంపల్లి గ్రామ మేకల సంత నిర్వహణ ద్వారా పంచాయతీకి ఏటా రూ.45.20 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. గత మార్చిలో మేకల సంత వేలం నిర్వహించగా ఈ నెలతో గడువు ముగియనుంది. కాగా, ఎన్నికల కోడ్ కారణంగా వేలం నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. సరైన నిర్ణయం తీసుకోని పక్షంలో ఎక్కడ మేకల సంత తరలిపోతుందో.., పంచాయతీ ఆదాయం కోల్పోతుందోననే అంశాలను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. అప్పటికే డీపీవో వెంకటేశ్వర్‌రావు మేకల సంత నిర్వహణతో పాటు హాజీపూర్, దొనబండ గ్రామపంచాయతీల్లో నిర్వహించే వారసంతల నిర్వహణపై కూడా ఉన్నతాధికారులతో పాటు ఎన్నికల సంఘానికి నివేదించారు. ఈ తరుణంలో వేంపల్లి మేకల సంతతో పాటు హాజీపూర్, దొనబండ వారసంతల నిర్వహణను మూడు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. వాటి నిర్వాహకులకే మూడునెలలు పొడిగిస్తూ సమాచారం ఇవ్వగా ఏప్రిల్ మొదటి వారంలోగా ఇందుకు సంబంధించి నిర్వహణ డబ్బులు చెల్లించాలని సూచించారు. దీంతో పంచాయతీలు ఆదాయం కోల్పోకుండా ఉత్తర్వులు రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నట్లయింది.

అటవీ బీట్ ఆఫీసర్లకు అవగాహన

మంచిర్యాలక్రైం: ఫారెస్ట్ అకాడమీకి చెందిన 34వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972, తెలంగాణ ఫారెస్ట్ యాక్ట్ 1967పై స్థానిక జన్మభూమినగర్‌లోని కెమిస్ట్ భవన్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ, సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్, న్యాయవాది రామిండ్ల తిరుపతి వ్యవహరించారు. అటవీ సంరక్షణ, తెలంగాణ ఫారెస్ట్ యాక్ట్, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నటేశ్వర్, మంచిర్యాల ఎఫ్ఆర్ఓ రత్నాకర్‌రావ్, 46మంది ట్రైనీ బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ ఉద్యోగులకు జీఎం అభినందన



ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీని ఏరియా జీఎం మనోహర్‌రావు మంగళవారం సందర్శించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన 22.3 లక్షల టన్నుల బొగ్గు రవాణా కన్నా అదనంగా ఏడు లక్షల టన్నులు రవాణా చేసినందుకు సీహెచ్‌పీ ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో మరింత అధికంగా రవాణా చేయాలని సూచించారు. ఏజీఎం నాగరాజు, ఎస్ఈ చంద్రమౌళి, సూపర్‌వైజర్లు గంగాధర్, శ్రీనివాస్, వేణు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఏప్రిల్ 7వ తేదీన గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ మహాసభలను విజయవంతం చేయాలని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద మహాసభల ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. మహాసభలకు సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరు కానున్నట్లు తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆపాలని, సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యాన్ని నిలువరించాలని, పర్యావరణానికి ముప్పుగా మారిన ఓపెన్ కాస్టుల ఏర్పాటును ఆపాలని, డిపెండెంట్ ఉద్యోగాల్లో జరుగుతున్న మెడికల్ బోర్డు కుంభకోణంపై దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి రాష్ట్ర కార్యదర్శి బాబన్న, యువజన రాష్ట్ర కార్యదర్శి సిరాజ్, నాయకులు చందు, శ్రీనివాస్, సింగరేణి ఉద్యోగుల సంఘం మందమర్రి డివిజన్ అధ్యక్షుడు అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఉట్నూర్‌రూరల్: వైద్యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. మంగళవారం ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 32 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ పీహెచ్‌సీలోని ఎంసీహెచ్ యాక్టివిటీ, వ్యాధి నిరోధక టీకాలు, ఏఎన్‌సీ పరీక్షలపై అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ కాన్పులు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్యాధికారులు, డాక్టర్లు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల్ డిప్యూటీ డీఎంహెచ్‌వోలు పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయనందుకు బీఆర్ఎస్‌కు రాజీనామా



మాట్లాడుతున్న అశోక్‌యాదవ్

భీమారం: రెండో విడత మంజూరైన సబ్సిడీ గొర్రెలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, దీనికి నిరసనగా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండో విడతలో గొర్రెల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. దీంతో అశోక్‌యాదవ్‌తోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చయ్య, ముఖ్య సలహాదారు బేరీ రాంచెందర్‌యాదవ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు.

గూడెం హుండీల లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. జనవరి 6నుంచి మార్చి 25వ తేదీ వరకు హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా, మొత్తం రూ.6,23,103 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయశాఖ అధికారి రమేశ్ పర్యవేక్షణలో లెక్కించినట్లు పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, సిబ్బంది, సత్యనారాయణస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.80 లక్షలు

చెన్నూర్: చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ద్వారా నగదు రూపంలో రూ.2.80 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. 2.5 గ్రాముల బంగారం, 82.7 మిల్లి గ్రాముల వెండి వచ్చినట్లు పేర్కొన్నారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.